క్లుప్తంగా

వ్యక్తిత్వ వికాసంతోనే లక్ష్యాలపై స్పష్టత



మాట్లాడుతున్న సత్యప్రకాశ్

జమ్మికుంట: వ్యక్తిత్వ వికాసంతో లక్ష్యాలపై స్పష్టత కలిగి ఉంటామని వ్యక్తిత్వ వికాస నిపుణుడు బోల్లంపల్లి సత్యప్రకాశ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డా.రమేశ్ అధ్యక్షతన వ్యక్తిత్వ వికాసంపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం భవిష్యత్తుకు బలమైన పునాది అవుతుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డా.ఓదెలుకుమార్, స్టాఫ్ సెక్రటరీ డా.గణేశ్, అకాడమిక్ కోఆర్డినేటర్ రాజేంద్రం తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు రసీదు ఇస్తున్న నాయకులు

జమ్మికుంట: పట్టణం, మండలంలోని జమ్మికుంట, అబాది జమ్మికుంట, మాచనపల్లి, కోరపల్లి, మోత్కులగూడెం, రంగమ్మపల్లి, పెద్దంపల్లి, విలాసాగర్, కొత్తపల్లిలోని ప్రభుత్వ పాఠశాలల్లో తెలంగాణ ఉపాధ్యాయ సంఘం తపస్ (టీపీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమనేని తిరుపతిరావు ఆధ్వర్యంలో మంగళవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కట్కూరి శ్రీధర్‌రెడ్డి, కన్వీనర్ జిట్టవేణి శ్రీను, మండల అధ్యక్షుడు బైరి సురేశ్, కామిరెడ్డి రాజిరెడ్డి, కేతిరి శ్రీనివాస్‌రెడ్డి, పింగిళి విజయ, అలబాక ఫణికుమార్, సారంగం, స్నేహలత, పద్మ, వీరాచారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ



సైకిళ్లతో విద్యార్థులు

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్, కేశవపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం 34 మంది పదో తరగతి విద్యార్థులకు మోదీ కానుకగా కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్ అందించిన సైకిళ్లను బీజేపీ నాయకులు అందజేశారు. మండల అధ్యక్షుడు అనిల్, వెంకట్‌రెడ్డి, సమ్మిరెడ్డి, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులతో ప్రభాకర్‌రెడ్డి

చిగురుమామిడి: సర్కార్ బడుల్లో ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని, విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని మర్రి చెన్నారెడ్డి మానవవనరుల కేంద్రం ప్రొఫెసర్, ప్రభుత్వ సలహాదారు తాడ ప్రభాకర్‌రెడ్డి కోరారు. బొమ్మనపల్లి జిల్లాపరిషత్ సెకండరీ పాఠశాలలో 6 నుంచి 10వ తరగతుల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు మంగళవారం టిఫిన్ బాక్స్‌లు, పెన్నులు పంపిణీ చేసి మాట్లాడారు. ఒకప్పుడు ఇదే పాఠశాలలో ఎలాంటి వసతులు లేవని, కమ్మల గుడిసెల్లో చదువుకున్నామని, చెప్పారు. ఈ ఏడాది పదో తరగతిలో 10 జీపీఏ సాధించినవారికి క్యాష్ ప్రైజ్ అందజేస్తానని పేర్కొన్నారు. హెచ్ఎం లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉద్యానవన అధికారికి సన్మానం



కమలాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ఇల్లందకుంట: మండలంలోని ఎంపీడీవో కార్యాలయానికి మంగళవారం మొదటిసారి వచ్చిన జిల్లా ఉద్యానవన అధికారి కమలాకర్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. ఎక్కటి సంజీవరెడ్డి, గూడెపు సారంగపాణి, కనుమల్ల సంపత్, బండ రాజ్‌కుమార్, రాంబాబు, బోగం పృథ్వీ, బోగం మురళి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ వార్డు అధికారుల బదిలీ?

హుజూరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం భారీ ఎత్తున మున్సిపల్ వార్డు అధికారులను బదిలీ చేయనున్నట్లు తెలిసింది. ఇందులో భాగంగా జమ్మికుంట మున్సిపల్ నుంచి 20 మంది, హుజూరాబాద్ బల్దియా నుంచి సుమారు 22 మంది బదిలీలు కానున్నారు. దీంతో మున్సిపల్ అభివృద్ధి కుంటుపడే అవకాశం ఉందని పలువురు పట్టణవాసులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం పునరాలోచన చేసి బదిలీలకు ముందే వారి స్థానంలో ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

అసంపూర్తిగా.. అధ్వానంగా

చొప్పదండి: పట్టణంలోని రాష్ట్ర రహదారిపై చేపట్టిన సెంట్రల్ లైటింగ్ పనుల్లో భాగంగా డ్రైనేజీ పనులు అసంపూర్తిగా చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సుమారు 2 కిలోమీటర్లకు పైగా సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ 9వ వార్డు పరిధిలోని సీఎస్ఐ చర్చికి వెళ్లే మూలమలుపు వద్ద పనులు నిలిపివేశారు. రహదారి 100 అడుగుల వెడల్పు కాగా, రోడ్లు భవనాలశాఖలోని స్థలంలో మొదట డ్రైనేజీ పనులు చేపట్టగా ఇక్కడ మాత్రం ఏడాదిగా పనులు నిలిచిపోయాయి. 2 కిలోమీటర్ల మేర ఆర్అండ్‌బీ పరిధిలోని నిర్మాణాలు తొలగించి పనులు చేపట్టిన అధికారులు ఇక్కడ మాత్రం ఉదాసీనత వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికే సెంట్రల్ లైటింగ్ పనుల ఆలస్యంతో రోడ్డు ప్రమాదాలు జరిగి పలువురు మృత్యువాత పడగా, అధికారులు ఆ దిశగా దృష్టి సారించడం లేదు. గతంలో పని చేసిన కమిషనర్ రోడ్డుపక్కన అక్రమ నిర్మాణాలను తొలగించాలని పలుసార్లు నోటీసులు జారీ చేసినా అమలుకు నోచుకోకపోవడం గమనార్హం.



నిర్మాణం పూర్తికాక పిచ్చిమొక్కలతో నిండిపోయిన కాలువ

- హైవే పక్కన పనుల్లో నిర్లక్ష్యం
- డ్రైనేజీ నిర్మాణంలో జాప్యం
- ఇబ్బంది పడుతున్న స్థానికులు

నత్తనడకన పనులు

సెంట్రల్ లైటింగ్ పనులు నత్తనడకన సాగుతుండడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ఇళ్లలోకి నీళ్లు వస్తున్నాయని లోతట్టు ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు. రెండేళ్లుగా సబ్ కాంట్రాక్టర్ చేపట్టిన రూ.కోట్ల విలువైన సెంట్రల్ లైటింగ్ పనులు ఎప్పుడు పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది.

తారు వేసేదెన్నడో..

తారు రోడ్డు నిర్మాణానికి ముందే డివైడర్ పనులు పూర్తి చేయగా, ఇరుకు రోడ్డుపై పదుల సంఖ్యలో ప్రమాదాలు, మరణాలు సంభవించాయి. తాజాగా రోడ్డు విస్తరణకు తవ్వకాలు చేపట్టి కంకర పనులు పూర్తి కావస్తున్నా తారురోడ్డు వేయడంలో నిర్లక్ష్యం కొనసాగుతోంది. కొందరు కంకర రోడ్డుపైనే తమ వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. ఆర్అండ్‌బీ రోడ్డును కబ్జా చేసినవారిపై సంబంధిత అధికారులు, ట్రాఫిక్ నియంత్రణపై పోలీస్ శాఖ పర్యవేక్షణ లేక వ్యాపారులకు ఇష్టారాజ్యంగా మారిందని విమర్శలు వస్తున్నాయి.

విచారణ జరుపుతాం

చొప్పదండిలో అసంపూర్తి డ్రైనేజీ పనులపై విచారణ జరుపుతున్నాం. ఏవైనా న్యాయ పరమైన ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటాం. ఇళ్లలోకి నీరు చేరకుండా ఏర్పాట్లు చేశాం. పనులు త్వరగా పూర్తి చేయించడంపై దృష్టిసారించాం.

– నాగరాజు, మున్సిపల్ కమిషనర్, చొప్పదండి

నిమజ్జనాన్ని త్వరగా ముగించాలి

చొప్పదండి: గణేశ్ నిమజ్జనం సందర్భంగా భక్తులు అధికారులకు సహకరించి నిమజ్జన ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఎస్సై నరేశ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నాగరాజు కోరారు. పట్టణ శివారులోని నవోదయ విద్యాలయం ఎదురుగా గల ఎస్సారెస్పీ కాలువలో గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు. నిమజ్జన స్థలంలో లైటింగ్, నీటి వసతి వంటి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్, మేనేజర్ ప్రశాంత్ కుమార్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

జమ్మికుంటలో..

జమ్మికుంట: పట్టణంలోని నాయిని చెరువ వద్ద వినాయక నిమజ్జనం ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్ మంగళవారం పరిశీలించారు. నిమజ్జనానికి అవసరమైన జేసీబీలు, క్రేన్‌లు, బ్లేడ్ ట్రాక్టర్లను ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. మేనేజర్ రాజిరెడ్డి, ఏఈ వికాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేశ్, సదానందం, ఈఈ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని బీసీ, ఎస్సీ, బాలికల డిగ్రీ, పీజీ హాస్టళ్లను మున్సిపల్ కమిషనర్ తనిఖీ చేశారు. భోజన సదుపాయాల, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులు తెలుసుకున్నారు.



నిమజ్జనం ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

బీఆర్ఎస్ నాయకుల రాస్తారోకో



హుజూరాబాద్‌లో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



మానకొండూర్‌లో..

హుజూరాబాద్/జమ్మికుంట/శంకరపట్నం/మానకొండూర్/చిగురుమామిడి/ఇల్లందకుంట/సైదాపూర్: కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ నాయకులు చేస్తున్న కుట్రలకు నిరసనగా మంగళవారం జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు రాస్తారోకో, ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. హుజూరాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా రాస్తారోకో చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, విండో చైర్మన్ ఎడవెల్లి కొండల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు. జమ్మికుంట పట్టణం గాంధీచౌక్ వద్ద నిర్వహించిన ధర్నాలో తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, కేడీసీసీ వైస్ చైర్మన్ పింగిళి రమేశ్, పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్, నాయకులు పాల్గొన్నారు. శంకరపట్నం మండలంలో కరీంనగర్–వరంగల్ రోడ్డుపై రాస్తారోకో చేసి కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మండల అధ్యక్షుడు మహిపాల్, మెట్‌పల్లి విండో చైర్మన్ సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. మానకొండూర్‌లో చేపట్టిన రాస్తారోకోలో మాజీ జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్ తదితరులు పాల్గొన్నారు. చిగురుమామిడి మండలంలో చేపట్టిన ధర్నాలో మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, ఇల్లందకుంటలో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ విజయ, సైదాపూర్‌లో మండల అధ్యక్షుడు సోమవరపు రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

రామడుగు: ప్రతి విద్యార్థి విద్యతో పాటుగా క్రీడల్లో రాణించాలని, గ్రామీణస్థాయి నుంచి జాతీయస్థాయికి ఎదిగేందుకు కృషి చేయాలని రిటైర్డ్ ఎంఈవో అంబటి వేణుకుమార్ సూచించారు. మంగళవారం మండలంలోని వెలిచాల జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో ఎస్‌జీఎఫ్ మండలస్థాయి సెలక్షన్ టోర్నీని ప్రారంభించారు. ఈ పోటీల్లో మండలంలోని పలు పాఠశాలల నుంచి దాదాపు 200 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు పోటీల నిర్వహణ కమిటీ కార్యదర్శి దత్తాత్రి శర్మ తెలిపారు. హెచ్ఎం రాజరాజేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

గంగాధర: క్రీడల్లో విద్యార్థులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని ఎంఈవో ప్రభాకర్‌రావు సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మండల స్థాయి క్రీడా పోటీలను మంగళవారం ప్రారంభించారు. హెచ్ఎం అనితకుమారి, తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

సంక్షిప్త వార్తలు

పీఎం విశ్వకర్మ యోజన కిట్లు అందజేత

రామడుగు: మండలంలోని పలువురు విశ్వబ్రాహ్మణ లబ్ధిదారులకు మంజూరైన ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన కిట్స్‌ను మంగళవారం బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు ఒంటెల కరుణాకర్‌రెడ్డి అందజేశారు.

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌పై మోరె గణేశ్ అనే వ్యక్తి ఎంపీడీవోకు ఫిర్యాదు చేశాడు. సమస్యలపై గ్రామపంచాయతీకి వచ్చినవారిని కార్యదర్శి బెదిరిస్తున్నారని, తదితర వాటిపై ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై ఎంపీడీవో కృష్ణప్రసాద్‌ను వివరణ కోరగా, కార్యదర్శితో పాటు అతడి కుటుంబ సభ్యులను ఓ వ్యక్తి దూషించడంతో విచక్షణ కోల్పోయిన కార్యదర్శి శ్రీనివాస్ కుర్చీలేపారని తెలిసిందన్నారు. కార్యదర్శికి నోటీస్ జారీ చేస్తామని పేర్కొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి జలాభిషేకం

గన్నేరువరం: కాళేశ్వరంపై కాంగ్రెస్ కుట్రలు నిరసిస్తూ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న ఆధ్వర్యంలో మండలకేంద్రంలో కేసీఆర్ చిత్రపటానికి కాళేశ్వరం నీటితో జలాభిషేకం చేశారు.

రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

జమ్మికుంట: కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. మంగళవారం కామ్రేడ్ సీతారం ఏచూరి జయంతిని పురస్కరించుకొని పట్టణంలో వడ్లూరి కిషోర్ అధ్యక్షతన రాజ్యాంగం ఎదుర్కొంటున్న సవాళ్లు అనే అంశంపై సెమినార్ నిర్వహించారు.

సత్యసాయిబాబా జయంతి

ఇల్లందకుంట: సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని శ్రీరామసాయి మానవ సేవ చారిటబుల్ ట్రస్ట్‌లో పుట్టపర్తి సత్యసాయి బాబా 100వ జయంతిని ఘనంగా నిర్వహించారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

జమ్మికుంట: వావిలాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయం, మండలంలోని మడిపల్లి గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు.

గణపతి నిమజ్జన నూతన కమిటీ

హుజూరాబాద్: హుజూరాబాద్ గణపతి నిమజ్జన ఉత్సవ సమితి కార్యనిర్వాహక కమిటీ మంగళవారం ఏర్పాటయింది. అధ్యక్షుడిగా బుర్ర నటరాజ్, గౌరవ అధ్యక్షుడుగా గందె శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా కెడి రాజు, ములుగు పూర్ణచందర్, నల్లగొని రాకేశ్ తదితరులు ఎంపికయ్యారు.

యువతి అదృశ్యం

జమ్మికుంట: పట్టణానికి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు టౌన్ సీఐ రామకృష్ణ మంగళవారం తెలిపారు. సదరు యువతి ఈ నెల 1న ఓ షాపునకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



బ్యాగులను ప్రదర్శిస్తున్న కమిషనర్ తదితరులు

జమ్మికుంట: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహాయంతో మహిళలు అన్నిరంగాల్లో ఆర్థికంగా ఎదగాలని మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్, ఏడీఎంసీ మల్లీశ్వరి అన్నారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన సమాఖ్య మహాసభలో మాట్లాడారు. మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకొని కొత్త వ్యాపారాలు ప్రారంభించాలన్నారు. ముందుగా 2024–25 ఆర్థిక సంవత్సరం లావాదేవీలను చదివి వినిపించారు. మున్సిపల్ మేనేజర్ రాజిరెడ్డి, పట్టణ సమాఖ్య కార్యదర్శి మౌనిక, కోశాధికారి గీత, జ్యోతి, మంజుల పాల్గొన్నారు.

కేసీఆర్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గంగాధర: ఎమ్మెల్సీ కవిత పట్ల కేసీఆర్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. కొద్ది రోజులుగా కవిత చేసే పనుల వల్ల పార్టీకి నష్టం జరుగుతుందన్నారు. బీఆర్ఎస్ అంటే నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఇంటి పార్టీ, 60 లక్షల మంది సైనికులు, నాయకులు, కార్యకర్తలు ఉన్న సైన్యం అన్నారు. కన్న కూతురు కంటే కష్ట కాలంలో పార్టీకి అండగా ఉన్న కార్యకర్త భవిష్యత్ ముఖ్యమని తీసుకున్న నిర్ణయం హర్షించదగ్గ విషయమన్నారు.

యూరియా కోసం రైతుల ధర్నా



ధర్నా చేస్తున్న రైతులు

జమ్మికుంట: యూరియా అందించాలని వీణవంక మండలం శ్రీరాములపేట, కొండపాక, పోతిరెడ్డిపల్లి, హిమ్మత్‌నగర్, రెడ్డిపల్లి, కోర్కల్ గ్రామాలకు చెందిన రైతులు మంగళవారం రోడ్డుపై ధర్నా నిర్వహించారు. కుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. గిల్లు మల్లయ్యయాదవ్, బొబ్బల సమ్మిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, సమ్మయ్య, సంపత్, రమేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

లోలెవల్ బ్రిడ్జిపై అదుపుతప్పిన బైక్



శంకరపట్నం: మండలంలోని అర్కండ్ల లోలెవల్ బ్రిడ్జిపై మంగళవారం బైక్ అదుపుతప్పింది. బ్రిడ్జిపై వరదనీరు ప్రవహిస్తుండడంతో నాచు పేరుకుపోగా, వీణవంక మండలం కిష్టంపేటకు చెందిన వ్యక్తి బైక్‌పై వెళ్తూ జారిపడ్డాడు. మరో వాహనదారు సాయంతో బైక్‌ను పైకి లేపారు. అర్కండ్ల వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని మాజీ సర్పంచ్ అనిత, గ్రామస్తులు కోరుతున్నారు.

తుది ఓటరు జాబితా ప్రదర్శన

గంగాధర: మండలంలోని గ్రామ పంచాయతీలకు సంబంధించి తుది ఓటరు జాబితాను మంగళవారం ఎంపీడీవో రాము ప్రదర్శించారు. మూడు రోజుల గడువులో ఎలాంటి అభ్యంతరాలు లేకపోవడంతో తుది జాబితాను ప్రదర్శించారు

కుంకుమపూజ

గన్నేరువరం/రామడుగు/ఇల్లందకుంట: గన్నేరువరం మండలం చీములకుంటపల్లెలో మంగళవారం భామండ్ల యువసేన ఆధ్వర్యంలో వినాయక మండపం వద్ద కుంకుమ పూజ ఘనంగా నిర్వహించారు. రామడుగు మండలం షానగర్‌లో శివ గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 21 రకాల పత్రాలతో ప్రత్యేక పూజలు చేశారు. ఇల్లందకుంట మండలకేంద్రంలోని అన్నపూర్ణ ఆర్యవైశ్య అన్నదానసత్రంలో కుంకుమార్చన, అన్నదానం నిర్వహించారు.



గన్నేరువరం: చీమలకుంటపల్లెలో కుంకుమపూజ

రామడుగు: మండలంలోని వెదిర బస్టాండ్ సమీపంలో వాటర్‌ట్యాంకు ప్రమాదకర స్థితిలో ఉందని గ్రామస్తులు తెలిపారు. ఎప్పుడు కూలిపోతుందోనని వాపోతున్నారు. ఐదేళ్ల క్రితమే ట్యాంకును కూల్చివేయాలని అధికారులు నిర్ణయించారు. కానీ, ఇప్పటికీ అదే ట్యాంకు నుంచి నీటి సరఫరా చేస్తున్నారు. అధికారులు స్పందించి ప్రమాదకర స్థితిలో ఉన్న ట్యాంకును తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
శరాణ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, రామడుగు, సెల్ నంబర్ : 63099 54418

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227



చొప్పదండిలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న నాయకులు

జన నేతకు ఘన నివాళి

సంక్షేమ, అభివృద్ధి పథకాలతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేద ప్రజల గుండెల్లో నిలిచిపోయారని కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. మంగళవారం వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు.

– చొప్పదండి/హుజూరాబాద్/చిగురుమామిడి/ఇల్లందకుంట/సైదాపూర్



ఇల్లందకుంటలో..



బొర్నపల్లిలో వైఎస్సార్ విగ్రహానికి నాయకుల నివాళి



చిగురుమామిడి మండలంలో..



సైదాపూర్‌లో..

పోటీ పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధం కావాలి

కొత్తపల్లి: బిజినెస్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు ప్రతిష్టాత్మక క్యాట్ లాంటి పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలని హైదరాబాద్ స్కూల్ ఆఫ్ ఇన్నోవేషన్ అండ్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ డా.ఆర్.రాజ్‌కుమార్ అన్నారు. కరీంనగర్‌లోని సీతారాంపూర్ శివారులో గల రాజశ్రీ కన్వెన్షన్‌లో మంగళవారం 'అల్ఫోర్స్ ప్రజ్వల్–2025' పేరిట అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల బీబీఏ విద్యార్థులకు నిర్వహించిన గెట్ టూ గెదర్ 2కే25 కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీబీఏ విద్యార్థులు వ్యవస్థాపక నైపుణ్యాలను పెంపొందించుకోవడంతో పాటు నిర్దిష్టమైన లక్ష్యాన్ని ఏర్పరుచుకొని పట్టుదలతో శ్రమించి జీవితంలో విజయ తీరాలను చేరుకోవాలని అన్నారు. కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలను, కేస్ స్టడీస్ నైపుణ్యాలను పెంచుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ రకాల ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం విద్యార్థినుల సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, మేనేజ్‌మెంట్ క్లబ్ సభ్యులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ రాజ్‌కుమార్

కాంగ్రెస్‌లో ఫ్లెక్సీ వివాదం

తిమ్మాపూర్: కాంగ్రెస్‌లో ఫ్లెక్సీల వివాదం రాజకీయ చర్చకు దారితీసింది. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు, ఆయన అభిమానుల చర్యలపై మానకొండూరు నియోజకవర్గ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్ష పదవి కోసం ప్రయత్నిస్తూనే కరీంనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జిగా అనధికారికంగా కొనసాగుతున్న రాజేందర్‌రావు తీరు వివాదాస్పదంగా మారింది. ఈ నేపథ్యంలో మానకొండూరు కాంగ్రెస్ శ్రేణులు రాజేందర్‌రావు కార్యాలయం వద్ద దాడికి సిద్ధమైనప్పటికీ, హెచ్చరికలతో సరిపెట్టి, రాజీమార్గం కోసం చర్చలు జరిపారు. ఫ్లెక్సీలను తన అభిమానులు ముద్రించారని, ఇకముందు ఇలాంటి పొరపాట్లు జరగకుండా చూస్తానని రాజేందర్‌రావు హామీ ఇచ్చారు. దీంతో నాయకులు శాంతించారు.

ప్రొటోకాల్ ఉల్లంఘనపై ఆగ్రహం



ఎమ్మెల్యే ఆఫీస్‌లోలో మాట్లాడుతున్న నాయకులు

మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఫొటోలు ఫ్లెక్సీల్లో లేకపోవడం వివాదానికి కారణమైంది. ప్రభుత్వం వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తుందనే ప్రచారం కోసం జిల్లా కేంద్రంలో మండపాలు, ఆటోలపై రాజేందర్‌రావు అభిమానులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీల్లో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, రాజేందర్‌రావు ఫొటోలు ఉన్నాయి. కానీ, ఎమ్మెల్యే కవ్వంపల్లి ఫొటోలు లేకపోవడం పార్టీ శ్రేణులను కలవరపరిచింది. దీనిపై మంగళవారం ఎల్ఎండీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమావేశమైన నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.